ఆర్మీలో అగ్నివీర్ అవుతారా?

ఇండియన్ ఆర్మీ అగ్నివీర్ ప్రకటనలు దేశ వ్యాప్తంగా వెలువడ్డాయి. ఎనిమిదో తరగతి విద్యార్హతతోనూ కొన్ని ఉద్యోగాలకు పోటీ పడవచ్చు. పరీక్ష, ఫిజికల్ టెస్టులతో నియామకాలుంటాయి. అవకాశం వచ్చినవారు శిక్షణతో కలిపి నాలుగేళ్లు ఆర్మీలో సేవలు అందించవచ్చు. అనంతరం వీరిలో 25 శాతం మందిని శాశ్వత ఉద్యోగంలోకి తీసుకుంటారు. మిగిలినవారు ఆర్థిక ప్రోత్సాహకాలతో వైదొలగాలి. ప్రకటనల పూర్తి వివరాలు...

తెలంగాణ అభ్యర్థులకు ఆర్మీ రిక్రూట్ మెంట్ ఆఫీస్, సికింద్రాబాద్, ఆంధ్ర ప్రదేశ్ వారికి గుంటూరు, విశాఖపట్నం నియామక కేంద్రాల ఆధ్వర్యంలో పరీక్షలు, ఫిజికల్ టెస్టులు నిర్వహిస్తారు. ముందు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తారు. అందులో ప్రతిభావంతులకు ఫిజికల్ టెస్టులు ఉంటాయి. తాజా నోటిఫికేషన్ ద్వారా.. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ టెక్నికల్ (ఆల్ ఆర్మ్స్), అగ్నివీర్ క్లర్క్/ స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మన్ పోస్టులను భర్తీ చేస్తారు.

పరీక్ష ఇలా..

ఆన్‌లైన్ పరీక్ష నిమిత్తం 5 కేంద్రాలు ఎంచుకోవాలి. తప్పు సమాధానానికి పావు శాతం మార్కులు తగ్గిస్తారు. ఇండియన్ ఆర్మీ వెబ్‌సైట్‌లో ప్రాక్టీస్ టెస్టు అందుబాటులో ఉంచారు. దాన్ని రాసి, పరీక్షపై అవగాహన పెంచుకోవచ్చు. పరీక్షలో.. జనరల్ నాలెడ్జ్, జనరల్ సైన్స్, మ్యాథ్స్, లాజికల్ రీజనింగ్ విభాగాల్లో ప్రశ్నలు వస్తాయి. దరఖాస్తు చేసుకున్న పోస్టు ప్రకారం ప్రశ్నపత్రం టెక్నికల్ పోస్టులకు ఫిజిక్స్, కెమిస్ట్రీల్లోనూ ప్రశ్నలు వస్తాయి.

పోస్టులు..అర్హతలు

- **అగ్నివీర్ జనరల్ డ్యూటీ:** పదో తరగతిలో 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. గ్రేడ్‌ల్లో అయితే కనీసం సీ2 అవసరం. అలాగే ప్రతి సబ్జెక్టులోనూ 33 శాతం ఉండాలి. లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారికి డ్రైవర్ పోస్టులకు ప్రాధాన్యమిస్తారు. ఎత్తు 166 సెం.మీ. ఉండాలి.
- **అగ్నివీర్ టెక్నికల్:** మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్ ఉత్తీర్ణులు ఈ పోస్టులకు అర్హులు. ప్రతి సబ్జెక్టులోనూ 40 శాతం, మొత్తం మీద 50 శాతం మార్కులు పొందాలి. లేదా పదో తరగతిలో ప్రతి సబ్జెక్టులోనూ 40 శాతం, మొత్తం మీద 50 శాతం మార్కులతో పాటు నిర్దేశిత ట్రేడ్/బ్రాంచీల్లో రెండేళ్ల ఐటీఐ లేదా మూడేళ్ల డిప్లొమా కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎత్తు 165 సెం.మీ. ఉండాలి.
- **అగ్నివీర్ క్లర్క్, స్టోర్ కీపర్ టెక్నికల్:** ఏ గ్రూప్‌తోనైనా ఇంటర్‌లో 60 శాతం మార్కులు పొందినవాళ్లు వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే ప్రతి సబ్జెక్టులోనూ కనీసం 50 శాతం మార్కులు రావాలి. ఇంగ్లిష్, మ్యాథ్స్/ అకౌంట్స్/ బుక్ కీపింగ్‌లో 50 శాతం తప్పనిసరి. ఎత్తు 162 సెం.మీ. ఉండాలి.
- **అగ్నివీర్ ట్రేడ్స్‌మన్:** పదో తరగతిలో ఉత్తీర్ణులైతే చాలు. ప్రతి సబ్జెక్టులోనూ 33 శాతం మార్కులు ఉండాలి. ఎత్తు 166 సెం.మీ. అవసరం.
- **అగ్నివీర్ ట్రేడ్స్‌మన్:** ఎనిమిదో తరగతిలో ఉత్తీర్ణులైతే చాలు. ప్రతి సబ్జెక్టులోనూ 33 శాతం మార్కులు తప్పనిసరి. ఎత్తు 166 సెం.మీ. ఉండాలి.

వయసు: పై అన్ని పోస్టులకూ కనిష్ఠంగా 17 1/2 గరిష్ఠంగా 21 ఏళ్లలోపు ఉండాలి. అక్టోబరు 1, 2002 - ఏప్రిల్ 1, 2006 మధ్య జన్మించినవారు అర్హులు. అన్ని పోస్టులకు ఎత్తుకు తగ్గ బరువు అవసరం. ఛాతీ విస్తీర్ణం 77 సెం.మీ. ఉండాలి. సర్వీస్‌మెన్, ఎక్స్ సర్వీస్‌మెన్, వార్ విడో పిల్లలకు ఇందులో కొంత మినహాయింపులు వర్తిస్తాయి.

బోనస్ మార్కులు

- ఎక్స్ సర్వీస్ మెన్ పిల్లలకు 20 ఉంటాయి.
- క్రీడల్లో రాణించినవారికి స్థాయిని బట్టి గరిష్ఠంగా 20 మార్కులు కేటాయించారు.
- ఎన్‌సీసీ ఎ ఉంటే 5, బికి 10, సి 20, సీతోపాటు రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొంటే 25 మార్కులు.
- పది తర్వాత రెండేళ్ల ఐటీఐకి 20, రెండు లేదా మూడేళ్ల డిప్లొమాకి 30 మార్కులు
- ఇంటర్ తర్వాత ఏడాది ఐటీఐకి 30, రెండేళ్లదైతే 40 మార్కులు.
- ఇంటర్ తర్వాత డిప్లొమా చేస్తే 50 మార్కులు.

అయితే ఈ బోనస్ మార్కులు గరిష్ఠంగా టెక్నికల్ పోస్టులైతే 50, మిగిలినవాటికి 25 కలుపుతారు. వీటిని పరీక్షలో సాధించిన మార్కులకు జతచేసి మెరిట్ లిస్టు రూపొందిస్తారు. అర్హులకు ఫిజికల్ టెస్టులు నిర్వహిస్తారు.

ఫిజికల్ టెస్టులు

అన్ని పోస్టులకూ ఫిజికల్ టెస్టులో అర్హత సాధించడం తప్పనిసరి. ఇందులో భాగంగా 1.6 కి.మీ. దూరాన్ని 5 నిమిషాల 30 సెకన్లలో పూర్తిచేస్తే 60 మార్కులు, 5 నిమిషాల 31 సెకన్ల నుంచి 5 నిమిషాల 45 సెకన్ల లోపు పూర్తిచేస్తే 48 మార్కులు ఇస్తారు. కనీసం 6 పుల్‌అప్స్ తప్పనిసరి. 6 తీసినవారికి 16, 7 తీస్తే 21, 8కి 27, 9కి 33, 10 తీస్తే 40 మార్కులు పొందవచ్చు. 9 అడుగుల దూరానికి దూకగలిగితే అర్హత సాధిస్తారు. జిగ్‌జాగ్ బ్యాలెన్స్‌లో అర్హత సాధించాలి. అనంతరం ఫిజికల్ మెజర్‌మెంట్, మెడికల్ టెస్టులు ఉంటాయి. వీటన్నింటిలో విజయవంతమైతే శిక్షణకు ఎంపికచేస్తారు.

అవకాశమొస్తే...

మొదటి సంవత్సరం: రూ.30,000
రెండో ఏడాది రూ.33,000
మూడో ఏడాది రూ.36,500
నాలుగో ఏడాది రూ.40,000
చెల్లిస్తారు.

వర్తించేవి

నాలుగేళ్ల సేవలకు గానూ సేవానిధి ప్యాకేజీ అందిస్తారు. వార్షిక సెలవులు 30 ఉంటాయి. ఆరోగ్య సమస్యను బట్టి సిక్ లీవ్ కేటాయిస్తారు. నాలుగేళ్ల సర్వీస్‌లో ఉన్నప్పుడు రిస్క్ అండ్ హార్డ్‌షిప్, రేషన్, డ్రెస్, ట్రావెల్ అలవెన్సులు మాత్రం అందిస్తారు. నాలుగేళ్లపాటు రూ.48 లక్షలకు లైఫ్ ఇన్సూరెన్స్ కవర్ వర్తిస్తుంది. నాలుగేళ్ల సేవలకు గానూ వీరికి అగ్నివీర్ స్కిల్ సర్టిఫికెట్ అందుతుంది. అలాగే పన్నెండో తరగతి అంటే ఇంటర్మీడియట్‌తో సమాన స్థాయి సర్టిఫికెట్ ఇస్తారు.

వర్తించనివి...

వీరికి పింఛను, గ్రాట్యుటీ వర్తించవు. ఎక్స్ సర్వీస్‌మెన్‌గానూ పరిగణించరు. కరవు భత్యం, మిలటరీ సర్వీస్ పే (ఎంఎస్‌పీ) వీరికి వర్తించవు. ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) సైతం ఉండదు.

సేవానిధి..

ప్రతి నెలా అందుకునే మొత్తంలో 30 శాతం కార్పస్ ఫండ్‌కి జమ చేస్తారు. అంటే మొదటి ఏడాది ప్రతి నెల పొందే 30,000 నుంచి రూ.9000 మినహాయిస్తారు. అగ్నివీరుని చేతికి రూ.21,000 అందుతుంది. రెండో ఏడాది రూ.23,100 వేతనం అందుతుంది. రూ.9900 నిధిలో జమ అవుతుంది. మూడో ఏడాది రూ.25,500 చేతికి వస్తుంది. రూ.10,950 నిధికి వెళ్తుంది. ఇలా నాలుగో ఏడాదికి వచ్చే సరికి వీరునికి రూ.28,000, నిధికి రూ.12,000 వెళ్తాయి. మొత్తం నాలుగేళ్ల వ్యవధికి గానూ సేవానిధిలో రూ.5.02 లక్షలు అగ్నివీరుని నుంచి పోగవుతుంది. అంతే మొత్తాన్ని ప్రభుత్వమూ జమ చేస్తుంది. అంటే రూ.10.04 లక్షలన్నమాట. దీనికి వడ్డీని కలిపి అగ్నివీరునికి అందిస్తారు. సెల్ఫ్ ఎంప్లాయిమెంట్/ఆంత్రప్రెన్యూర్‌షిప్ నిమిత్తం వీరికి బ్యాంకుల నుంచి రుణాలు మంజూరయ్యేలా ఏర్పాట్లు చేస్తారు.

మధ్యలో మానేస్తే...

అగ్నివీరులు నాలుగేళ్లలోపే కావాలంటే వైదొలగొచ్చు. అలాంటి సందర్భంలో అగ్నివీరుని వేతనం నుంచి జమ అయిన మొత్తాన్నే చేతికి అందిస్తారు. వీరికి ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహం ఉండదు.

ఉద్యోగంలోకి...

నాలుగేళ్ల వ్యవధి పూర్తిచేసుకున్న అగ్నివీరుల ఒక్కో బ్యాచ్ నుంచి గరిష్ఠంగా 25 శాతం మందిని ఆర్మీలో శాశ్వత ఉద్యోగంలోకి తీసుకుంటారు. ఇందుకోసం నాలుగేళ్ల వ్యవధిలో చూపిన ప్రతిభను ప్రామాణికంగా తీసుకుంటారు. ఇలా ఎంపికైనవారు 15 ఏళ్లు విధుల్లో కొనసాగవచ్చు.

ఆన్‌లైన్ దరఖాస్తులు: మార్చి 15 వరకు స్వీకరిస్తారు. **ఫీజు:** రూ.250
ఆన్‌లైన్ పరీక్షలు: ఏప్రిల్ 17 నుంచి నిర్వహిస్తారు.
వెబ్‌సైట్ https://joinindianarmy.nic.in/

నోటిఫికేషన్స్ ఉద్యోగాలు

ఐఐపీఈ-విశాఖపట్నంలో ఫ్యాకల్టీ

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: కెమికల్ ఇంజినీరింగ్, ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, పెట్రోలియం ఇంజినీరింగ్ తదితరాలు.
అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌లో బీటెక్, బీఈ, పీహెచ్‌డీ
1. ప్రొఫెసర్: కనీసం 10 ఏళ్ల అనుభవం **2. అసోసియేట్ ప్రొఫెసర్:** కనీసం 6 ఏళ్ల అనుభవం **3. అసిస్టెంట్ ప్రొఫెసర్:** కనీసం 3 ఏళ్ల అనుభవం **వయసు:** 35-55 ఏళ్లు ఉండాలి.
ఎంపిక: స్క్రీనింగ్, ఇంటర్వ్యూల ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 31.03.2023.
వెబ్‌సైట్: https://iipe.ac.in/careers

భారత్ ఎలక్ట్రానిక్స్‌లో ప్రాజెక్ట్ ఇంజినీర్‌లు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ 110 ప్రాజెక్ట్ ఇంజినీర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: బీఈ, బీటెక్/ ఇంజినీరింగ్ బీఎస్సీ (ఎలక్ట్రానిక్స్/ టెలికమ్యూనికేషన్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రికల్/ కమ్యూనికేషన్/ మెకానికల్/కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్/ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్/ ఇన్ఫర్మేషన్ సైన్స్/ ఐటీ)తో పాటు పని అనుభవం.
వయసు: 01.02.2023 నాటికి 32 సంవత్సరాలు మించకూడదు.
పని ప్రదేశాలు: విశాఖపట్నం, న్యూదిల్లీ, ఘజియాబాద్, బెంగళూరు.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూల ఆధారంగా.
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: 17.03.2023.
వెబ్‌సైట్: https://bel-india.in/

వాక్ ఇన్స్

కేంద్రీయ విద్యాలయం-ఉప్పల్‌లో..

హైదరాబాద్‌లోని ఉప్పల్ కేంద్రీయ విద్యాలయం పీజీటీ, టీజీటీ, పీఆర్‌టీ, కోచ్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: మ్యాథ్స్, కెమిస్ట్రీ, హిందీ, సైన్స్, కామర్స్, మ్యూజిక్, డ్యాన్స్, హాకీ/ అథ్లెటిక్స్, యోగా తదితరాలు.
అర్హత: పోస్టును అనుసరించి బీఈడీ/ బ్యాచిలర్స్ డిగ్రీ/ డిప్లొమా/ బీఈ/బీఎస్సీ/ డీఈడీ/ ఇంటిగ్రేటెడ్ డిగ్రీ/ పీజీ డిగ్రీ/ మాస్టర్స్ డిగ్రీ.
● సీటెట్ అర్హత సాధించాలి. **వయసు:** 18-65 ఏళ్లు ఉండాలి.
ఎంపిక: ఇంటర్వ్యూలో మెరిట్ ఆధారంగా.
ఇంటర్వ్యూ వేదిక: Kendriya Vidyalaya.No.1, Uppal, Hyderabad.
ఇంటర్వ్యూ: మార్చి 7, 10 (ఉదయం 8:30 గంటలు).
వెబ్‌సైట్: https://no1uppal.kvs.ac.in/

శివరాంపల్లిలో..

హైదరాబాద్‌లోని శివరాంపల్లి కేంద్రీయ విద్యాలయం ఎస్‌వీపీ ఎన్‌పీఏ పీజీటీ, టీజీటీ, పీఆర్‌టీ, వొకేషనల్ కోచ్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, కంప్యూటర్ సైన్స్, కామర్స్
అర్హత: పోస్టును అనుసరించి బీఈడీ/ బ్యాచిలర్స్ డిగ్రీ/ డిప్లొమా/ బీఈ/బీఎస్సీ/ డీఈడీ/ ఇంటిగ్రేటెడ్ డిగ్రీ/ పీజీ డిగ్రీ/ మాస్టర్స్ డిగ్రీ.
వయసు: 18-65 ఏళ్లు ఉండాలి.
ఎంపిక: ఇంటర్వ్యూలో మెరిట్ ఆధారంగా.
ఇంటర్వ్యూ వేదిక: KENDRIYA VIDYALAYANO SVP NPA, HYDERABAD -500052.
ఇంటర్వ్యూ: 10.03.2023. (ఉదయం 8:30, మధ్యాహ్నం 12:30 గంటలు) **వెబ్‌సైట్:** https://npasvp.kvs.ac.in/

సీడీఆర్ఐ, లఖ్‌నవూలో ప్రాజెక్ట్ పోస్టులు

లఖ్‌నవూలోని సీఎస్ఐఆర్- సెంట్రల్ డ్రగ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కింది ప్రాజెక్ట్ స్టాఫ్ నియామకానికి వాక్ ఇన్ నిర్వహిస్తోంది.
● సైంటిఫిక్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్: 1 ● జేఆర్ఎఫ్(ప్రాజెక్ట్): 2
● ప్రాజెక్ట్ అసోసియేట్-1: 7 ● ప్రాజెక్ట్ అసోసియేట్-2: 1
● సీనియర్ రిసెర్చ్ అసోసియేట్: 1 ● ప్రాజెక్ట్ అసిస్టెంట్ లెవెల్-1: 2
అర్హత: సంబంధిత డిగ్రీ, ఎంఎస్సీ, ఎంటెక్, ఎంఫార్మసీ, పీహెచ్‌డీ.
ఇంటర్వ్యూ: 14.03.2023, 15.03.2023.
వేదిక: సెంట్రల్ డ్రగ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, బీఎస్ 10/1, సెక్టార్ 10, జానకీపురం ఎక్స్‌టెన్షన్, సీతాపూర్ రోడ్డు, లఖ్‌నవూ.
వెబ్‌సైట్: https://cdri.res.in/

తాజా ఇంటర్న్‌షిప్‌లు

వర్క్ ఫ్రమ్ హోమ్

బిజినెస్ డెవలప్‌మెంట్
సంస్థ: ట్రిగ్‌రెగ్జామ్
స్టైపెండ్: నెలకు రూ.6,000- రూ.7,000
దరఖాస్తు గడువు: 27.03.2023
అర్హతలు: ఇంగ్లిష్, ఎంఎస్ ఎక్సెల్ నైపుణ్యాలు
☛ internshala.com/i/1da83f

ఫండ్ రైజింగ్
సంస్థ: తారే జమీన్ ఫౌండేషన్
స్టైపెండ్: నెలకు రూ.1,000
దరఖాస్తు గడువు: 14.03.2023
అర్హతలు: ఫండ్ రైజింగ్ నైపుణ్యాలతో పాటు ఆసక్తి ఉన్న విద్యార్థులు
☛ internshala.com/i/5cf84d

హ్యూమన్ రిసోర్సెస్
సంస్థ: జెకూన్ ఎంటర్‌ప్రైజెస్
స్టైపెండ్: నెలకు రూ.5,000
దరఖాస్తు గడువు: 17.03.2023
అర్హతలు: ఇంగ్లిష్, ఎంఎస్ ఎక్సెల్ నైపుణ్యాలు
☛ internshala.com/i/16cf74

యూఐ/యూఎక్స్ డిజైన్
సంస్థ: వాల్‌నట్
స్టైపెండ్: నెలకు రూ.4,000- రూ.10,000
దరఖాస్తు గడువు: 17.03.2023
అర్హతలు: డిజైన్ థింకింగ్, ఫిగ్మా, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్, యూఐ డెవలప్‌మెంట్ నైపుణ్యాలు
☛ internshala.com/i/557a9d

బ్యాక్‌ఎండ్ డెవలప్‌మెంట్
సంస్థ: డెవ్‌టౌన్
స్టైపెండ్: నెలకు రూ.10,000
దరఖాస్తు గడువు: 17.03.2023
అర్హతలు: అమెజాన్ వెబ్‌సర్వీస్, ఎక్స్‌ప్రెస్.జేఎస్, గ్రాఫ్ క్యూఎల్, మాంగోడీబీ, నోడ్.జేఎస్, రెస్ట్ ఏపీఐ నైపుణ్యాలు
☛ internshala.com/i/46cf29

సోషల్‌మీడియా మార్కెటింగ్
సంస్థ: కే ఇన్ఫోటెక్
స్టైపెండ్: నెలకు రూ.1,000
దరఖాస్తు గడువు: 17.03.2023
అర్హతలు: క్రియేటివ్ రైటింగ్, డిజిటల్, సోషల్ మీడియా మార్కెటింగ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/b980f0

లా చదివితే..?

ఎల్ఎల్‌బీ కోర్సు హైదరాబాద్‌లోని ఏయే యూనివర్సిటీల్లో ఉంది? దీని తర్వాత ఉండే ఉద్యోగావకాశాలేమిటి? – ఎం. అజయ్‌కుమార్

■ కనీసం మూడు సంవత్సరాల వ్యవధి గల ఏ డిగ్రీ పూర్తి చేసినవారైనా, మూడు సంవత్సరాల ఎల్ఎల్‌బీ కోర్సు చదవొచ్చు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ హైదరాబాద్‌లో ఉస్మానియా యూనివర్సిటీలో ఉంది. ఈ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న ప్రైవేటు న్యాయ కళాశాలలూ ఈ కోర్సును అందిస్తున్నాయి. ప్రవేశానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే టీఎస్ లాసెట్‌లో ఉత్తీర్ణత సాధించాలి. ఇంటర్ తర్వాత ఐదేళ్ల లా కోర్సును నల్సార్ యూనివర్సిటీ అందిస్తోంది. నల్సార్‌లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో నిర్వహించే క్లాట్ ప్రవేశపరీక్ష రాయవలసి ఉంటుంది. ఉస్మానియా యూనివర్సిటీ, యూనివర్సిటీ అనుబంధ ప్రైవేటు న్యాయ కళాశాలలు కూడా ఐదేళ్ల లా కోర్సు అందిస్తున్నాయి. ఈ కోర్సులో ప్రవేశానికి టీఎస్ లాసెట్ రాయాలి. హైదరాబాద్‌లో ఉన్న కొన్ని డీమ్డ్/ ప్రైవేటు యూనివర్సిటీల్లో ఐదేళ్ల లా కోర్సులో చేరటానికి ఏదైనా జాతీయ/ రాష్ట్ర స్థాయి/ సంబంధిత ప్రైవేటు యూనివర్సిటీ ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణత సాధించివుండాలి.

ఒకప్పుడు ఎల్ఎల్‌బీ చదివినవారికి న్యాయవాద వృత్తిని మినహాయిస్తే పెద్దగా ఉద్యోగావకాశాలు ఉండేవి కావు. కానీ ఇటీవలికాలంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో చాలారకాల ఉద్యోగాలు అందుబాటులోకి వచ్చాయి. ఎల్ఎల్‌బీ చదివినవారు లీగల్ అసోసియేట్, లా ఆఫీసర్, కార్పొరేట్ లాయర్, లీగల్ అడ్వైజర్, లీగల్ ఎనలిస్ట్, పబ్లిక్ ప్రాసిక్యూటర్, మెజిస్ట్రేట్, జ్యుడిషియల్ ఆఫీసర్ లాంటి ఉద్యోగాలు చేయవచ్చు. మీకు ఆసక్తి ఉంటే ఎల్ఎల్‌బీ తర్వాత ఎల్ఎల్ఎం/ పీహెచ్‌డీ చేసి బోధన రంగంలోనూ స్థిరపడవచ్చు. ఇవన్నీ కాకుండా సొంతంగా ప్రాక్టీస్ పెట్టుకొనే అవకాశం ఎలాగూ ఉంటుంది.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

మేథమెటికల్ సంస్థలో మేటి కోర్సులు

నిర్దిష్టంగా కొన్ని సబ్జెక్టుల కోసమే ప్రత్యేకంగా సంస్థలను ఏర్పాటు చేశారు. అలాంటివాటిలో చెన్నై మ్యాథమెటికల్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంఐ) ఒకటి. ఇక్కడ మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్‌లో బీఎస్సీ, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీలతోపాటు ఎమ్మెస్సీ డేటాసైన్స్‌నూ అందిస్తున్నారు. వీటిలో ప్రవేశానికి ప్రకటన వెలువడింది. పరీక్షలో చూపే ప్రతిభతో ప్రవేశం లభిస్తుంది. పేద విద్యార్థులకు ఫీజు మినహాయింపు, ప్రతిభావంతులకు స్టైపెండ్ అందిస్తున్నారు.

మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్ కోర్సుల్లో చేరాలనుకున్నవారు, పరిశోధనల దిశగా అడుగులేయాలనుకున్నవారు సీఎంఐలో చేరడానికి అధిక ప్రాధాన్యం ఇవ్వవచ్చు. ఇక్కడ బోధన ప్రమాణాలు, పరిశోధన వనరులు మెరుగ్గా ఉంటాయి. దేశంలో ప్రసిద్ధ సంస్థలతోపాటు విదేశాల నుంచి నిపుణులు వచ్చి సీఎంఐ విద్యార్థులకు బోధిస్తారు.

ఇన్ఫోసిస్, టీసీఎస్, మైక్రోసాఫ్ట్, శ్రీరాం గ్రూప్... తదితర కార్పొరేట్ సంస్థలతోపాటు కేంద్రానికి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ దీనికి నిధులు అందిస్తున్నాయి. యూజీసీ 2006లో ఈ సంస్థకు యూనివర్సిటీ హోదా ఇచ్చింది. ఇక్కడి విద్యార్థులు దేశీయంగానే కాకుండా ప్రపంచ స్థాయి సంస్థల్లో బోధన, పరిశోధనలో గొప్ప అవకాశాలు సొంతం చేసుకుంటున్నారు.

గత ఏడాది ప్రాంగణ నియామకాల్లో గరిష్ఠంగా రూ.62 లక్షల ప్యాకేజీ లభించింది. సగటున రూ.16 లక్షల వార్షిక వేతనం సీఎంఐలో చదువుకున్నవారు పొందుతున్నారు. ఇంటర్న్‌షిప్‌లో రూ.80వేల వరకు స్టైపెండ్ అందుతోంది.

ఫీజు..ఫెలోషిప్పులు

అన్ని కోర్సులూ రెసిడెన్షియల్ విధానంలో అందిస్తున్నారు. అన్ని కోర్సులకు ట్యూషన్ ఫీజు ప్రతి సెమిస్టర్‌కు రూ.1.25 లక్షలు చెల్లించాలి. ఎమ్మెస్సీ డేటా సైన్స్‌కు రూ.2.5 లక్షలు. విద్యార్థుల ఆర్థిక నేపథ్యం బట్టి అన్ని కోర్సుల్లోనూ పూర్తిగా లేదా పాక్షికంగా ఫీజు మినహాయింపు లభిస్తుంది. అలాగే ప్రతిభావంతులకు యూజీ కోర్సులకు ప్రతి నెలా రూ.5000 ఫెలోషిప్ చెల్లిస్తారు. ఎమ్మెస్సీ కోర్సులైతే రూ.6000 అందిస్తారు. పీహెచ్‌డీలకు మొదటి రెండేళ్లు నెలకు రూ.31,000 తర్వాత మూడేళ్లు రూ.35,000 చెల్లిస్తారు. పీహెచ్‌డీలో చేరి, ప్రాంగణంలో వసతి సౌకర్యం పొందనివారు స్టైపెండ్‌లో 24 శాతం హెచ్ఆర్ఏ అందుకోవచ్చు. వీరికి ఏటా బుక్ గ్రాంట్ రూ.పదివేలు ఇస్తారు.

ప్రవేశం ఎలా?

అన్ని కోర్సుల్లోనూ పరీక్షలో చూపిన ప్రతిభతో ప్రవేశం కల్పిస్తారు. నేషనల్ ఒలింపియాడ్‌ల్లో ప్రతిభ చూపినవారికి నేరుగా యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు అవకాశం ఉంటుంది. పీజీ, పీహెచ్‌డీలకు పరీక్షలతోపాటు ఇంటర్వ్యూలూ ఉంటాయి. ఫిజిక్స్‌లో పీహెచ్‌డీకి పరీక్ష నిర్వహించరు. జాయింట్ ఎంట్రన్స్ స్క్రీనింగ్ టెస్ట్ (జెస్ట్) స్కోరుతో నేరుగా ఇంటర్వ్యూకి అవకాశం కల్పిస్తారు. అలాగే మ్యాథ్స్‌లో పీహెచ్‌డీ చేయాలనుకున్నవారు నేషనల్ బోర్డు ఫర్ హయ్యర్ మ్యాథమెటిక్స్ (ఎన్‌బీహెచ్ఎం) ఫెలోషిప్పునకు ఎంపికైతే పరీక్ష రాయకుండా నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావచ్చు. ఇదే మాదిరిగా జస్ట్‌తో కంప్యూటర్ సైన్స్‌లో రిసెర్చ్ అర్హత పొందినవారు సైతం నేరుగా ఇంటర్వ్యూతో ప్రవేశం పొందవచ్చు.

కోర్సులు..అర్హతలు

బీఎస్సీ ఆనర్స్: మ్యాథ్స్ అండ్ కంప్యూటర్ సైన్స్; మ్యాథ్స్ అండ్ ఫిజిక్స్
అర్హత: ఇంటర్ ఉత్తీర్ణులు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎమ్మెస్సీ: మ్యాథ్స్, కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్
అర్హత: డిగ్రీలో మ్యాథ్స్ లేదా బీస్టాట్ లేదా బీటెక్ చదువుకున్నవారు ఎమ్మెస్సీ మ్యాథ్స్‌కు అర్హులు. కంప్యూటర్ సైన్స్ బ్యాక్‌గ్రౌండ్‌తో బీఎస్సీ, బీటెక్ కోర్సులు చదివినవారు ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. మ్యాథ్స్, స్టాటిస్టిక్స్ లేదా కంప్యూటర్ సైన్స్ నేపథ్యంతో యూజీ కోర్సులు చదివినవారు ఎమ్మెస్సీ డేటా సైన్స్‌కు అర్హులు. సంబంధిత సబ్జెక్టుల్లో ఆఖరు సంవత్సరం కోర్సులు చదువుతోన్న విద్యార్థులూ అర్హులే.

పీహెచ్‌డీ: మ్యాథ్స్, కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్
అర్హత: సంబంధిత విభాగాల్లో పీజీ ఉత్తీర్ణులు, చివరి ఏడాది కోర్సులు చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

■ **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** ఏప్రిల్ 9
■ **దరఖాస్తు ఫీజు:** రూ.వెయ్యి. రెండు కోర్సులకు రూ.1200. ■ **పరీక్ష తేదీ:** మే 7
■ **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం. ■ **వెబ్‌సైట్:** www.cmi.ac.in/admissions/

పరీక్ష ఇలా...

రెండు బీఎస్సీ కోర్సులకూ ఉమ్మడి పరీక్ష వంద పాయింట్లకు నిర్వహిస్తారు. ఇందులో 2 విభాగాలు ఉంటాయి. ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ తరహా ప్రశ్నలు వస్తాయి. పార్ట్ ఏ 40, పార్ట్ బీ 60 పాయింట్లు. పరీక్ష వ్యవధి 3 గంటలు. పార్ట్ ఏ స్క్రీనింగ్. ఇందులో కనీస పాయింట్లు సాధిస్తే పార్ట్ బీ మూల్యాంకనం చేస్తారు. తుది ఎంపిక రెండు విభాగాల్లో సాధించిన పాయింట్లతో ఉంటుంది. పార్ట్ ఏలో 10 ప్రశ్నలు వస్తాయి. ఒక్కో దానికి 4 పాయింట్లు. పార్ట్ బీలో 6 ప్రశ్నలు ఉంటాయి. వీటికి 60 పాయింట్లు. ప్రశ్నలన్నీ ఇంటర్ మ్యాథ్స్‌లో ఆల్జీబ్రా, జామెట్రీ, ట్రిగనోమెట్రీ, కాలిక్యులస్ విభాగాల నుం